
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
శుక్రవారం 7 జూన్ 2024





ఆకివీడులో వర్షంతో బురదమయమైన హైవే

చల్లబడిన వాతావరణం

- భారీ వర్షంతో ఏకధాటిగా ఉరుముల శబ్దం
- నరసాపురంలో అత్యధికంగా 80.6 మిల్లీమీటర్ల వర్షపాతం
- ఆకివీడులో అత్యల్పంగా 11 మిల్లి మీటర్లు

భీమవరం టౌన్, జూన్ 6 : రుతుపవనాల ప్రభావంతో జిల్లాలోని అన్ని మండలాల్లోనూ భారీ వర్షం కురిసింది. బుధవారం రాత్రినుంచి ఏకధాటిగా ఉరుములు, పిడుగులతో ప్రజలను వాతావరణం భయభ్రాంతులకు గురిచేసింది. ఆకస్మాత్తుగా మబ్బులతో ఆకాశం మేఘావృతమైంది. బుధవారం సాయంత్రం 6.30 ప్రాంతంలో చినుకులతో ప్రారంభమైన వాన తెల్లవారేవరకు పడుతూనే ఉంది. దాదాపు రెండు గంటలకుపైగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి గురువారం ఉదయం 8.30 ప్రాంతానికి జిల్లాలో 685.4 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో సగటున 34.3 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యధికంగా నరసాపురంలో 80.6 మిల్లి మీటర్ల వర్షపాతం.. అత్యల్పంగా ఆకివీడులో 11 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదైంది. ఇక మిగిలిన మండల్లాలో నమోదైన వర్షపాత వివరాలివి.. పెనుమంట్రలో 31.2 మిల్లిమీటర్ల వర్షపాతం, పెనుగొండ-16.2, ఆచంట-11.2, పోడూరు-10.6, మొగల్తూరు-63.2, పాలకొల్లు-46.8, యలమంచిలి-12.2, గణపవరం-51.2, ఉండి- 19.4, పాలకోడేరు-18.8, వీరవాసరం-40.2, భీమవరం-45.2, కాళ్ల-30.2, తాడేపల్లిగూడెం-29.2, పెంటపాడు-33.2, తణుకు-46.2, అత్తిలి-58.8, ఇరగవరం-29.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



పుస్తకాలు పరిశీలిస్తున్న ఆర్‌జేడీ నాగమణి

విద్యార్థులకు సకాలంలో పుస్తకాలివ్వాలి

- విద్యాశాఖ ఆర్‌జేడీ నాగమణి

నరసాపురం, జూన్ 6 : పాఠశాలలు ప్రారంభించే సమయానికి విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయాలని విద్యాశాఖ ఆర్‌జేడీ నాగమణి సూచించారు. గురువారం నరసాపురంలో ప్రాంతీయ విద్యాకానుక గొడౌన్‌లు తనిఖీ చేసి మాట్లాడారు. నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు ఏమైనా కొరత వస్తే జిల్లా అధికారులకు సమాచారం అందిస్తే తక్షణమే సరఫరా చేస్తామన్నారు. షూలు, బెల్ట్‌లు అందించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో పుష్పరాజ్యం, సిబ్బంది ఉన్నారు.



ఆ 2 కిలోమీటర్లు తప్ప

కొనసాగుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు

7

రియల్ జోష్

అమాత్యులెవరు?

మంత్రి పదవి రేస్‌లో సీనియర్లు

- తొలి వరుసలో రఘురామరాజు, పితాని, నిమ్మల
- రఘురామకు స్పీకర్ పదవి అంటూ ప్రచారం
- మిత్రపక్షాలకు ఛాన్స్ ఉండేనా ? రేపటిలోగా స్పష్టత


కె.రఘురామకృష్ణరాజు


పితాని సత్యనారాయణ


నిమ్మల రామానాయుడు


పులపర్తి ఆంజిబాబు


మద్దిపాటి వెంకటరాజు


కొలుసు పార్థసారథి


కామినేని శ్రీనివాస్


బొలిశెట్టి శ్రీనివాస్

గోదావరి తీరాన చంద్రబాబు కొలువులో ఎవరు మంత్రులు కాబోతున్నారు. ఏ ఏ వర్గాలకు అవకాశం ఇవ్వబోతున్నారు. సామాజిక వర్గాల వారీగా బేరీజు వేసి, సీనియార్టీని ప్రాతిపదికగా తీసుకుని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రాతిపదికన ఎందరికి మంత్రి పదవులు దక్కనున్నాయి. అందరు ఊహించినట్లుగానే ట్రిపుల్ ఆర్‌కు స్పీకర్ ఇస్తారా? లేదా ? మంత్రి పదవితో సరిపెడతారా? అనే చర్చ అందరినోట.

- ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి

చంద్రబాబు మనస్సులో ఏముంది?

2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల మాదిరిగానే గోదావరి ఒడ్డున ఉమ్మడి కూటమికి ఓట్లు పోటెత్తాయి. అధికార వైసీపీకి ఒక్క సీటు దక్కనివ్వకుండా మట్టి కరిపించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికే పట్టం కట్టారు. తిరుగులేని మెజార్టీ రికార్డులను సృష్టించారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఈ నెల 12న ప్రమాణ స్వీకారం చేయనుంది. ఈలోపే కొత్తగా మంత్రి వర్గంలో ఎవరెవరికి స్థానం దక్కుతుందనేదే కూటమిలో ఆతృత. సీనియర్లు తమ కార్యకర్తలను ఇప్పటికే సముదాయిస్తున్నారు. నోరుజారి కామెంట్లు చేయవద్దంటూ వారిస్తున్నారు. 2014కి ఏ మాత్రం తగ్గకుండా ఉమ్మడి పశ్చిమ గోదావరిలోని 15 నియోజక వర్గాల్లోనూ కూటమికి సునామిలా ఫలితాలు వచ్చాయి. గెలిచిన వారిలో సీనియర్లతోపాటు తొలిసారి అసెంబ్లీకి పోటీ చేసిన వారు ఉన్నారు.

- టీడీపీ అధినేత చంద్రబాబు ఆశీస్సులు మెండుగా ఉన్న వారు లేకపోలేదు. ఇందులో ఉండి నుంచి గెలుపొందిన రఘురామకృష్ణరాజు పేరు తొలివరుసలో వినిపిస్తోంది. ఆయ న పోటీకి దిగిన వెంటనే కాబోయే స్పీకర్ అంటూ ఆయన అభిమానులంతా నినాదాలు చేశారు. జగన్ ప్రభుత్వంలో అవమానాలు ఎదుర్కొన్న ఆయన తగురీతిలో బదులు తీర్చుకుంటారంటూ సెటైర్లు విసిరారు. రఘురామ ఎక్కడా నోరు జారకుండా సంయమనంతో వ్యవహరిస్తూనే అంతా చంద్రబాబు చూసుకుంటారంటూ తన భవిష్యత్‌ను చెప్పకనే చెప్పారు. రఘురామను స్పీకర్‌గా తీసుకుంటారా ? లేక ? మంత్రి పదవితో సరిపెడతారా అంటూ ఓ చర్చ సాగుతోంది. చంద్రబాబు మనస్సులో ఏముందో కాని ఒకవైపు రఘురామ అభిమానులు, టీడీపీ శ్రేణులు రఘురామకు అత్యున్నత పదవి దక్కడం ఖాయమంటూ ఇప్పటికే ధీమాగా ఉన్నారు. నరసాపురం సిట్టింగ్ ఎంపీగా ఉన్న ఆయన జగన్‌రెడ్డి అకృత్యాలు, ప్రజా వ్యతిరేక విధానాలన్నింటిని రచ్చబండ రూపంలో బహిర్గతం చేశారు. ఎవరు జగన్‌కు వ్యతిరేకంగా నోరెత్తని సమయంలోను రఘురామే ముందు వరుసలో నిలబడి కాస్కో అంటూ జగన్‌కు బహిరంగ సవాల్ విసిరారు. ఇప్పుడు ఇవన్ని పరిగణనలోకి తీసుకున్నారు.
- వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోనూ, 2014లో చంద్రబాబు హయాంలోనూ ఆయా మంత్రి వర్గాల్లో చోటు దక్కించుకున్న సీనియర్‌గా ఆచంట ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు పితాని సత్యనారాయణ ఉన్నారు. ఆయన అనుభవం, మరోవైపు బీసీ వర్గాల ప్రతినిధిగా ఆయన కొత్త మంత్రి వర్గంలోనూ మరోసారి బంఫర్ ఆఫర్ ఇచ్చి తీరతారని జోరుగా ప్రచారం సాగుతోంది. ఉమ్మడి జిల్లాలో గెలిచిన అభ్యర్థుల్లో ఆయనే సీనియర్ కావడం పితానికి ఫ్లస్ పాయింట్. వివాదరహితుడిగా వున్న ఆయనకు అవకాశం ఇవ్వాలని ఇప్పటికే కొందరు డిమాండ్ చేయడం ఆరంభించారు. పితాని సైతం చంద్రబాబు తనకు ఛాన్స్ ఇస్తారన్న ఆశాభావంతో ఉన్నారు.
- టీడీపీ రాజకీయ వ్యవహారాల్లో కీలకంగా వ్యవహరించిన పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడికి సైతం చోటు ఖాయమంటూ ఇప్పటికే ప్రచారం జోరందుకుంది. దీనికి తగ్గట్లుగానే పోలింగ్‌కు ముందే కాబోయే మంత్రి అంటూ నిమ్మలను ఆయన అభిమానులంతా కీర్తిస్తూ వచ్చారు. ఆయన సంయమనంతో అధిష్ఠానం నిర్ణయిస్తుందంటూ సున్నితంగా తమ వారికి చెబుతూ వస్తున్నారు. మూడోసారి వరుసగా పాలకొల్లు నుంచి హ్యాట్రిక్ సాధించారు. జగన్ ప్రభుత్వంలో ప్రజా వ్యతిరేక చర్యలపై తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. వినూత్న నిరసనలు చేశారు. పార్టీ ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేశారు. చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడిగా మారారు. ఇవన్ని నిమ్మలకు కలిసి వచ్చే అంశాలే. బలమైన సామాజికవర్గానికి చెందిన రామానాయుడు తిరుగులేని మెజార్టీతో ఈసారి పాలకొల్లు నుంచి గెలుపొందారు.
- ఎన్నికల ముందే వైసీపీని వీడి టీడీపీలో చేరి నూజివీడు నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందిన కొలుసు పార్థసారథి మంత్రి పదవి ఆశిస్తున్నారు. ఆయన జగన్ ప్రభుత్వంలోను మంత్రిగా వ్యవహరించారు. తనకున్న అనుభవాన్ని బీసీ వర్గాలను దృష్టిలో పెట్టుకుని మరొక ఛాన్స్ ఇవ్వాల్సిందిగా కోరుతున్నట్లు సమాచారం. జిల్లాలో సీనియర్‌గా ఉన్న బీసీ నేత పితానికి అవకాశం ఇస్తారా? లేక? పార్థసారథికి ఇస్తారా? అనేదే పార్టీలో చర్చ సాగుతోంది.

గత ప్రభుత్వ హయాంలో..

గత ప్రభుత్వ హయాంలో ప్రాంతాలతో సంబంధం లేకుండా అప్పటి ముఖ్యమంత్రి జగన్, వైసీపీ ఎమ్మెల్యేలను మంత్రులుగా తీసుకున్నారు. అంతకుముందు వరకు జిల్లాలో డెల్టా, మెట్టప్రాంతాలుగా విభజించి మంత్రులను ఎంపిక చేసేవారు. జగన్ మాత్రం దానికి స్వస్తి చెప్పి నేరుగా ఎవరికి మంత్రి పదవి ఇవ్వాలంటే వారికే ఇచ్చేశారు. తాడేపల్లిగూడెం నుంచి కొట్టు సత్యనారాయణను ఉప ముఖ్యమంత్రిగా ఆ పొరుగునే ఉన్న తణుకు నుంచి కారుమూరి వెంకట నాగేశ్వరరావును మంత్రులుగా తీసుకున్నారు. కొవ్వూరులో ప్రాతినిధ్యం వహిస్తున్న తానేటి వనితను హోం మంత్రిగా ఎంపిక చేశారు. ఉమ్మడి పశ్చిమలో రెండో విడత ఈ ముగ్గురికి అవకాశం ఇచ్చారు. తొలి విడతలో ఈ ఏలూరు నుంచి ఆళ్ల నానిని ఉప ముఖ్యమంత్రిగా, ఆచంట నుంచి శ్రీరంగనాథ రాజును మంత్రిగా తీసుకున్నారు. అంటే సరా సరిన 13 మంది వైసీపీ ఎమ్మెల్యేల్లో గడిచిన ఐదేళ్లలో ఐదు గురికి మంత్రి పదవులు దక్కింది. ఆ ప్రాతిపదికన చంద్రబాబు సీనియర్లకు ఈసారి అవకాశం ఇచ్చి జూనియర్లకు ఆ తదుపరి ఛాన్స్ ఇస్తారని ప్రచారం ఇప్పటికే కూటమిలో ఊపందుకుంది. ఒకవేళ సామాజిక వర్గాల వారీగా కొందరిని సంతృప్తి పరిచేందుకు విప్ లేదా చీఫ్ విప్ పదవుల్లో ఒక పదవిని ఎవరో ఒకరికి కట్టబెట్టే అవకాశం లేకపోలేదనే ప్రచారం సాగుతోంది. ఇంతకుముందు విప్‌గా టీడీపీ హయాంలో చింతమనేని ప్రభాకర్, వైసీపీ హయాంలో ముదునూరి ప్రసాదరాజు వ్యవహరించారు. ఈసారి చింతమనేనికి మంత్రి పదవి దక్కకపోతే మరోసారి విప్ పదవి ఇస్తారని భావిస్తున్నారు.

మిత్రపక్షాల సంగతేంటి..

మంత్రి మండలిలో ఎవరికి చోటు ఇస్తారనే అంశంలో ఇప్పటికే ఐదుగురి పేర్లు వినిపిస్తుండగా, ఇంకోవైపు మిత్రపక్షాల తరపున ఎవరికి ఛాన్స్ ఇవ్వబోతున్నారనేదే ఓ పెద్ద సస్పెన్స్. జనసేన పక్షాన భీమవరం నుంచి ఎన్నికైన అంజిబాబు, తాడేపల్లిగూడెం నుంచి ఎన్నికైన బొలిశెట్టి శ్రీనివాస్ పేర్లు ఇప్పటికే ప్రముఖంగానే వినిపిస్తున్నాయి. అయితే జనసేన ప్రధాన ప్రతిపక్షంగా ఉండబోతుందని ప్రచారం సాగుతున్న తరుణంలో మరోవైపు మంత్రి వర్గంలో ఎవరెవ్వరికి చోటు అనే దానిపై చర్చ సాగడం విశేషం. అయితే జనసేన అధిపతి పవన్ కల్యాణ్ నిర్ణయం మేరకే ఉభయ గోదావరి జిల్లాల్లో రెండుకు పైగా మంత్రి పదవులు దక్కడం ఖాయమని, ఇప్పటికే భారీగా ప్రచారం సాగుతోంది. నరసాపురం, ఏలూరు లోక్‌సభ స్థానాల పరిధిలో కైకలూరు నుంచి బీజేపీ పక్షాన గెలిచిన ఏకైక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆయన ఇంతకుముందే 2014లో చంద్రబాబు మంత్రివర్గంలో పనిచేశారు. ఈసారి కూడా కామినేని తనకు అవకాశం వస్తుందని ఆశిస్తున్నారు.

- కరోనా సమయంలో పార్టీ వ్యవహారాలను దగ్గరుంచి పర్యవేక్షించటం పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశాలను క్షేత్రస్థాయిలోకి చేర్చడం, పలు అంశాలపై ప్రజాభిప్రాయ సేకరణ చేయడం, ఆ నివేదికలను అధిష్ఠానానికి చేరవేయడం వంటి కీలక బాధ్యతలు నిర్వహించి తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి హోదాలో గోపాలపురం నియోజకవర్గంలో హోం మంత్రి తానేటి వనితపై గెలుపొందిన మద్దిపాటి వెంకటరాజు సైతం ఇప్పటికే మంత్రివర్గ రేసులో ఉన్నారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా ఆది నుంచి ఆయన తెలుగుదేశం అధికారంలోకి రావడం ఎంత ఖాయమో, తాను మంత్రిని కావడం అంతే ఖాయమన్నట్లు కార్యకర్తలు వద్ద నేతలు వద్ద వ్యాఖ్యలు చేసేవారు.

దివ్యాంగులకు తొలి నెల రూ.15 వేలు


- నెలకు రూ.6 వేలు పింఛన్ అమలు
- వచ్చే నెలలో లబ్ధిదారుడికి రూ.15 వేలు
- జిల్లాలో 28,399 లబ్ధిదారుల ఎదురుచూపు

నరసాపురం, జూన్ 6: కూటమి అధికారంలోకి రావడంతో దివ్యాంగుల్లో జోష్ నెలకొంది. ఇప్పటివరకు నెలకు రూ.3వేలు మాత్రమే పెన్షన్ అందుకుంటున్నారు. వచ్చే నెల నుంచి రూ.6 వేలు అందనున్నాయి. ఎన్నికల హామీలో భాగంగా జూలైలో ఒక్కొక్క లబ్ధిదారుడికి పెండింగ్ బకాయితో కలిపి రూ.15వేలు పెన్షన్ రానుంది. దీనికోసం జిల్లాలోని 28,399 మంది దివ్యాంగులు ఎదురుచూస్తున్నారు. గతంలో ఎన్నడూ ఈ స్థాయిలో లబ్ధి చేకూరలేదని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమకు ఈ స్థాయిలో పింఛన్ అందిస్తారని ఊహించలేదన్నారు. పెరిగిన ధరలు, ఇతర ఖర్చులు, తమ పరిస్థితిని అర్థం చేసుకుని కూటమి రెట్టింపు పింఛన్ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. దివ్యాంగులకు ఇతర లబ్ధిదారుల కంటే ఎక్కువ మొత్తంలో పెన్షన్ ఇచ్చిన ఘనత టీడీపీకే దక్కింది. ఉమ్మడి రాష్ట్రంలో రూ.1000 ఉండేది. దాన్ని రాష్ట్ర విభజన తరువాత రూ.2 వేలకు పెంచారు. గత ఎన్నికల్లో భాగంగా టీడీపీతో పాటు వైసీపీ అధికారంలోకి వస్తే రూ.3వేలు పింఛన్ ఇస్తామన్నారు. దానికి అనుగుణంగా వైసీపీ పెంచి ఐదేళ్లపాటు ఇచ్చింది. ఎన్నికల హామీలో భాగంగా దివ్యాంగులకు వైసీపీ ప్రస్తుత పింఛన్ కొనసాగిస్తామన్నది. కూటమి మాత్రం రూ.6వేలు ఇస్తామని, ఆ మొత్తాన్ని ఏప్రిల్ నుంచే కలిపి ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే ఏప్రిల్ నుంచి జూన్ వరకు ప్రభుత్వం రూ.మూడు వేలు చొప్పున అందించింది. హామీలో భాగంగా ఏప్రిల్, మే, జూన్ మూడు నెలల బకాయి రూ.9 వేలతో పాటు జూలై పింఛన్ రూ.6వేలు మొత్తం రూ.15 వేలు అందించనున్నారు.



టీడీపీ హయాంలోనే మేలు జరిగింది

ప్రభుత్వ శాఖల్లో బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీతో పాటు సైకిళ్లు, మోటార్‌సైకిళ్లు, రుణాలు దివ్యాంగులకు అందించిన ఘనత టీడీపీకే దక్కింది. గతంలో దివ్యాంగులకు టీడీపీ మోటారుసైకిళ్లు ఇచ్చింది. అనేక శాఖల్లోని బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసింది. ఇప్పటివరకు నెల వారీ ఇస్తున్న పింఛన్ మొత్తాన్ని పెంచాలని అనేకసార్లు ప్రభుత్వా నికి విజ్ఞప్తి చేశాం, మా విన్నపాన్ని కూటమి ఆలకించి రూ.6వేలు చేయడం చాలా సంతోషంగా ఉంది.



- అప్పారావు
దివ్యాంగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

నామినేటెడ్ పదవులకు వైసీపీ నాయకుల రాజీనామా



(భీమవరం-ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఘోర పరాభవంతో ఆ పార్టీ నాయకులు నామినేటెడ్ పదవులకు రాజీనామాలు చేస్తున్నారు. సహకార సంఘాలు, దేవదాయ శాఖ, కార్పొరేషన్‌లకు చెందిన నామినేటెడ్ పదవులనుంచి వైసీపీ నాయకులు వైదొలుగుతున్నారు. అధికారులకు రాజీనామాలు సమర్పిస్తున్నారు. జిల్లాలో 252 సహకార సంఘాలు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేదు. త్రిసభ్య కమిటీలతో కాలం వెల్లదీశారు. ఇది చట్టవ్యతిరేకమైనప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదు. వైసీపీ నాయకులతో త్రిసభ్య సంఘాలను ఏర్పాటు చేసి సహకార సంఘాలను పరిపాలించారు. జిల్లా కేంద్ర సహకార సంఘం పరిస్థితి కూడా అదే. ప్రభుత్వం నామినేట్ చేసిన నాయకులే పాలిస్తున్నారు. అధికార పార్టీల ఎమ్మెల్యే సిఫారసు మేరకే త్రిసభ్య కమిటీలను నియమిస్తూ వచ్చారు. పదవీ కాలం ముగియగానే కొత్తవారికి అవకాశం కల్పించారు. త్రిసభ్య కమిటీల పాలనలో అవినీతి చోటుచేసుకుంది. సొసైటీకి వచ్చే ధాన్యం కమీషన్‌ను పక్కదారి పట్టించారు. ప్రభుత్వనుంచి రావాల్సిన బకాయిలు విడుదల చేయలేదు. త్రిసభ్య కమిటీ సభ్యులు ప్రభుత్వంపై ఒత్తిడి తేలేకపోయారు. ప్రశ్నించే సాహసం చేయలేదు. ఈవిధంగా ఐదేళ్లపాటు సొసైటీలు రాజకీయరంగు పులుముకున్నాయి. వైసీపీ ప్రభుత్వం ఓటమి పాలు కావడంతో త్రిసభ్య కమిటీ సభ్యులు రాజీనామాలు చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొన్ని కార్పొరేషన్‌లోను వైసీపీ నాయకులు పదవులు తెచ్చుకున్నారు. డైరెక్టర్లుగా నియమితులయ్యారు. హీరోలుగా వ్యవహరిస్తూ వస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు నిధులులేక బాధపడ్డారు. ఇప్పుడు ప్రభుత్వమే పోవడంతో ఒక్కొక్కరూ రాజీనామాలు చేస్తున్నారు. దేవదాయశాఖలోను, ధర్మకర్తల మండలి సభ్యులు రాజీనామా బాటపడుతున్నారు. జిల్లాలోని ప్రధాన ఆలయాలతోపాటు దేవదాయశాఖలోని అన్ని దేవాలయాలు ఎన్నికలముందే ధర్మకర్తల మండళ్లను ఏర్పాటు చేశారు. వైసీపీ క్రియాశీలక నాయకులకు మండళ్లలో ప్రాధాన్యత కల్పించారు. వారు అంతా తమ పదవులను వైదొలిగే ప్రయత్నంలో మునిగారు. వైసీపీ భారీ ఓటమిని జీర్ణించుకోలేకపోతున్నారు. రాజీనామాలే ఏకైక మార్గం అంటూ కమిటీలనుంచి రాజీనామాలు చేసేందుకు కసరత్తుచేసుకుంటున్నారు. ఇలా జిల్లాలోని అన్ని నామినేటెడ్ పదవులు ఖాళీ అవుతున్నాయి. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వమే వాటిని రద్దు చేయనుంది. అదే జరిగితే మరింత అవమానకరంగా ఉంటుందని అందుకే వైసీపీ నాయకులు ముందుగానే తమ పదవులకు రాజీనామాలు చేస్తున్నారు.

టీచర్ల దొడ్డిదారి బదిలీలకు బ్రేక్ !

కొత్త ప్రభుత్వం సంచలన నిర్ణయం



ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 6 : కౌన్సెలింగ్‌కు తూట్లు పొడుస్తూ పైరవీలు, సిఫారసులతో జగన్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు చేసిన ఉపాధ్యాయుల బదిలీలను తక్షణమే నిలిపివేయాలని కొత్త ప్రభుత్వం ఆదేశించడంతో ఉమ్మడి జిల్లాలో మొత్తం 30 మంది టీచర్ల బదిలీలకు బ్రేక్ పడింది. ఈ మేరకు పాఠశాల విద్యాకమిషనర్ సురేష్‌కుమార్, ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ జారీచేసిన ఉత్తర్వులు గురువారం జిల్లా విద్యాశాఖకు అందాయి. ఇలా బదిలీలు నిలిచిపోయిన వారిలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి ఎస్జీటీలు 16 మంది, స్కూల్ అసిస్టెంట్లు 13, పరస్పర బదిలీ ఒకటి ఉన్నాయి. వాస్తవానికి టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ గతేడాది జూన్‌లో ముగియగానే బదిలీలపై నిషేధం అమల్లోకి వచ్చింది. ఆ తదుపరి అదే ఏడాది డిసెంబరులో కౌన్సెలింగ్‌తో నిమిత్తం లేకుండా 'వాట్సాప్ బదిలీ'లుగా రాష్ట్రంలో వందల సంఖ్యలోనే దొడ్డిదారిన బదిలీలు జరిగిపోయాయి. ఇటువంటి అక్రమ బదిలీలు ఒక్కోదానికి రూ. లక్షల్లోనే చేతులు మారాయని అప్పట్లోనే ప్రచారం జరిగింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 15 మంది గత డిసెంబరులో బదిలీలు పొందారు. పట్టణ ప్రాంతాలు, సమీప పాఠశాలల్లో క్లియర్ వెకెన్సీలున్నచోట ఈ బదిలీలు జరగ్గా, కొందరికైతే ఖాళీలు లేకపోవడంతో ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేయాల్సి వచ్చింది. మళ్ళీ ఈ ఏడాది ఫిబ్రవరిలో పెద్దసంఖ్యలోనే ఉపాధ్యాయులు పైరవీలు, సిఫారసు లేఖలతో సీఎం పేషీ, మంత్రుల పేషీల నుంచి రికమండేషన్‌లు తెచ్చుకుని జిల్లాలో నచ్చిన పాఠశాలలకు బదిలీ కోసం దరఖాస్తు చేసుకోగా ఆ మేరకు 30 మందిని బదిలీ చేస్తూ ఈ ఏడాది మార్చినెలలో సంబంధిత ఉపాధ్యాయులకు వ్యక్తిగతంగా లేఖలను విద్యాశాఖ జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఇలా వందల సంఖ్యలోనే బదిలీలు జరిగాయి. బదిలీ లేఖలు అందుకున్న ఉపాధ్యాయులందరినీ ఏప్రిల్ నెలాఖరున పాఠశాల విధులనుంచి రిలీవై, మే 1న బదిలీ స్థానంలో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా ఏప్రిల్‌లోనే ఎన్నికల నియమావళి (ఎంసీసీ) అమల్లోకి రావడంతో బదిలీ స్థానాల్లో చేరేందుకు సాంకేతికంగా అడ్డంకులు వచ్చాయి. ఈ నేపథ్యంలో గురువారంతో (ఈనెల 6) ఎంసీసీ ముగిసి, బదిలీ పొందిన ఉపాధ్యాయులు నూతన స్థానాల్లో చేరేందుకు సమాయత్తమవుతున్న వేళ తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యేవరకు సంబంధిత టీచర్లనెవరినీ ప్రస్తుత స్థానాల నుంచి రిలీవ్ చేయవద్దని జిల్లా విద్యాశాఖకు బుధవారం సాయంత్రం మౌఖిక ఆదేశాలు జారీ అయ్యాయి. దీనికనుగుణంగానే గురువారం పాఠశాల విద్యాకమిషనర్, ముఖ్య కార్యదర్శిల నుంచి ఉత్తర్వులు అందాయి.

డబ్బూ పోయే..?!

ఎటువంటి ర్యాటిఫికేషన్, క్షేత్రస్థాయి నుంచి స్పష్టత లేకుండా జరిగిన ఈ బదిలీలకు కొందరు టీచర్లనుంచి లక్షలాది రూపాయల్లో వసూళ్ళు జరిగినట్టు ప్రచారం జరుగుతోంది. అధికారాన్ని కోల్పోయిన ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన ఓ మంత్రి, ఆయన బంధువు ఈ బదిలీల్లో ఆర్థికంగా బాగా లాభపడినట్టు ఆరోపణలున్నాయి. కౌన్సెలింగ్‌తో నిమిత్తం లేకుండా పైరవీలతో జరిగిన ఈ బదిలీలు ఒక్కొక్కదానికి రూ.3లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వసూళ్ళు చేసినట్టు ఓ ప్రచారం ఉంది. ఇలా అక్రమంగా జరుగుతున్న బదిలీలను తక్షణమే నిలుపుదల చేయాలని అన్ని ఉపాధ్యాయ సంఘాలు అప్పట్లోనే డిమాండ్ చేశాయి. నచ్చిన పాఠశాలకు బదిలీ కోసం రూ.లక్షల్లోనే సమర్పించుకున్న కొందరు ఉపాధ్యాయులు ఇప్పుడు నూతన స్థానాల్లో చేరేందుకు సమాయత్తమవుతుండగా అకస్మాత్తుగా కొత్త ప్రభుత్వం నిలిపివేయడంతో వారి పరిస్థితి డోలాయమానంలో పడినట్టయింది. కారణాలు ఏవైనా బదిలీలను నిలిపివేసిన నేపథ్యంలో డబ్బులు చెల్లించిన ఉపాధ్యాయులు ఇప్పుడు వాపస్ కోరదామనుకుంటే ఎన్నికల్లో ఘోరపరాజయం పొంది, అధికారాన్ని కోల్పోవడంతో కనీసం ఒత్తిడి చేయడానికి కూడా ఎవరూ లేక, అలాగని ఎవరికీ చెప్పుకోలేక లోలోన మదనపడుతూ రెండింటా నష్టపోయినట్టయింది. మరోవైపు కౌన్సెలింగ్‌పై నిషేధం వున్న సమయంలో ఎన్నిలకు ముందు జరిగిన ఈ బదిలీలపై పలు ఆరోపణలతో వివాదాస్పదం కావడం, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుతీరనుండడంతో ఏదైనా విచారణ పేరుతో ఇరకాటంలో పడతామేమోనన్న భయాందోళనలు ఉపాధ్యాయ వర్గాల్లో వ్యక్తమవుతోంది.





రామలింగేశ్వర స్వామి



నీటి మునిగిన స్వామి

నత్తారామేశ్వరం రామలింగేశ్వరస్వామి

దర్శనం నిలుపుదల

» నీటితో నింపిన ఆలయం » కిటకిటలాడిన భక్తులు

పెనుమంట్ర, జూన్ 6 : మండలంలోని నత్తా రామేశ్వరంలోని పరశురాముడు ప్రతిష్ఠించిన శ్రీరామలింగేశ్వర స్వామిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు స్వామివారిని దర్శించుకునేందుకు బార్లు తీరారు శివాలయం ప్రాంగణమంతా శివనామ స్మరణతో మార్మోగింది. శ్రీరామలింగేశ్వర స్వామికి ఏకాదశి రుద్రాభిషేకం మహన్యాస పూర్వక అభిషేకాలు నిర్వహించారు పంచామృతాలతో అభిషేకాలు చేశారు అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు అనంతరం స్వామివారిని ప్రత్యేక పూలతో అలంకరించారు మహా నివేదన అనంతరం స్వామి వారిని నీటితో నింపారు. ఏడాదిలో 11 నెలలు నీటిలో ఉండి వైశాఖ మాసంలో దర్శనం ఇచ్చే శ్రీరామలింగేశ్వర స్వామి దర్శనం పొందాలంటే ఏడాది ఎదురు చూడాల్సిందే. స్వామివారిని నరసాపురం పార్లమెంట్ సభ్యుడు భూపతి రాజు శ్రీనివాస్ వర్మ సతీమణి వెంకటేశ్వరి కుటుంబ సభ్యులు దర్శించుకుని అభిషేకాలు పూజలు నిర్వహించారు. ఆచంట నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ కేహెచ్ వి.ప్రసాద్ రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షుడు తమనంపూ డి.శ్రీరామ దుర్గారెడ్డి రవి, తుపాకుల గోవింద్, పృథ్విరాజ్, పుల్లాజి అర్చకులు రామేశ్వరపు రామలింగేశ్వర శర్మ, అభిషేక పురోహితులు కాశీభట్ల సూర్యనారాయణ మూర్తి భాస్కర శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 30 వరకు 'ఇగ్నో' ప్రవేశాలకు గడువు

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 6 : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) దూరవిద్య కోర్సులు, ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ అయిందని సీఆర్‌ఆర్ కళాశాల 'ఇగ్నో' స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్ కోర్సులు, యూజీ, పీజీ, డిప్లమో కోర్సులకు యూనివర్శిటీ వెబ్‌సైట్ ద్వారా ప్రవేశాలు పొందేందుకు జూన్ 30వ తేదీ వరకు గడువు ఉందన్నారు. వివరాలకు 94903 50469లో సంప్రదించాలని కోరారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 6 : ఏలూరు కలెక్టరేట్ సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ(డీఎల్‌టీసీ)లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు అసిస్టెంట్ డైరెక్టర్ రవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాశ్ యోజన పథకం కింద ఫీల్డ్ టెక్నీషియన్ ఎయిర్ కండీషనర్ కోర్సుల్లో మూడు నెలల ఉచిత శిక్షణ ఇస్తున్నామన్నారు. పదో తరగతి, ఆ పైన విద్యార్హతలు కలిగి 35 ఏళ్లలోపు వయస్సున్న అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా ఐటీఐ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబరు 83328 36944, 94934 82414లలో సంప్రదించాలన్నారు.

20న ఆక్వారంగ సమస్యలపై సమావేశం



విలేకర్లతో మాట్లాడుతున్న భగవాన్‌రాజు

పాలకొల్లు అర్బన్, జూన్ 2 : ఆక్వారంగ సమస్యలపై ఈ నెల 20వ తేదీన పాలకొల్లు శివా రు చందపర్రు రోడ్డులో ఎస్ఎస్ఎస్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని జైభారత్ క్షీరా రామా ఆక్వా రైతు సంఘ అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు పిలుపునిచ్చారు. స్థానిక సంఘ కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హెచరీస్‌లో, ఫీడ్ ధరలు, విద్యుత్ సమస్యలపై సమావేశంలో చర్చిస్తామన్నారు. నూతన ప్రభుత్వంలో సమస్యలు పరిష్కరించుకునే అవకాశం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశశారు. ఈ సమావేశానికి భారీ మెజారిటీలతో విజయం సాధించిన ఎంపీ, ఎమ్మెల్యేలను ఆహ్వానిస్తామన్నారు. సంఘ కార్యదర్శి బోణం చినబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు కోడి విజయభాస్కర్, రుద్రరాజు సత్యనారాయణ రాజు, కోశాధికారి దాట్ల సోమేశ్వర రాజు, సభ్యులు అంగర వర ప్రసాద్, బోణం రంగయ్య నాయుడు, జి.ఈశ్వరరాజు, జి.శ్రీను రాజు, జి.మనోహర వర్మ పాల్గొన్నారు.

ఓపెన్ దూరవిద్య పరీక్షకు 152 మంది గైర్హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 6 : ఓపెన్ స్కూల్స్ దూరవిద్య సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా గురువారం జరిగిన పదో తరగతి గణితం పరీక్షకు జిల్లాలో 436 మంది, ఇంటర్మీడియట్ గణితం పరీక్షకు 271 మంది, చరిత్ర పరీక్షకు 144 మంది విద్యార్థులు హాజరయ్యారని డీఈవో అబ్రహం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.

రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ రాజీనామా



రాఘవరెడ్డి

చాట్రాయి, జూన్ 6: ఎన్నికల్లో వైసీపీ ఓటమి చెందటంతో నైతిక బాధ్యత వహిస్తూ రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. గురువారం తన రాజీనామాను కమిషనర్ రిజిస్ట్రార్ ఆఫ్ కో ఆపరేటివ్ సొసైటీస్‌కి పంపారు. ఏడాదిన్నర పాటు ఆయన ఈ పదవిలో కొనసాగారు. 50 ఏళ్ల నుంచి రాజకీయాల్లో ఉన్న దేశిరెడ్డి సర్పంచ్, పీఏసీఎస్ అధ్యక్షుడిగా, జడ్పీటీసీ, ఏఎంసీ చైర్మన్ తదితర పదవులు నిర్వహించారు.

అడ్మిషన్ కౌంటర్‌లో కానరాని సిబ్బంది



ఏలూరు క్రైం, జూన్ 6 : స్థానిక ప్రభుత్వాసుపత్రి అత్యవసర విభాగం ఎంతో ముఖ్యమైనది. ఎన్నో ప్రమాదకరమైన కేసులు వస్తూ ఉంటాయి వారికి ఓపీ టిక్కెట్‌ను ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసి ఇవ్వాల్సి ఉంది. ఆసుపత్రిలో చేరితే ఆన్‌లైన్‌లో వారి వివరాలు అన్నీ నమోదు చేయాల్సి ఉంది. ఒక వేళ రిఫరల్ అయితే వెంటనే ఓపీ టిక్కెట్‌తో పాటు రిఫరల్ కార్డు రాసి పంపించాల్సి ఉంది. ఇవన్నీ కూడా అత్యవసర విభాగంలో ఎంతో కీలకమైన విధులు. ఇక్కడ మూడు షిఫ్టులుగా ఎంఎన్‌వోలు అడ్మిషన్ కౌంటర్‌లో పనిచేస్తూ ఉంటారు. గురువారం రాత్రి 8 గంటల నుంచి అక్కడ ఎవ్వరు విధులలో లేకపోవ డంతో ఎంతో మంది ఆసుపత్రి కి వచ్చిన వారు అడ్మిషన్లు లేక, ఓపీ టిక్కెట్ లేక అత్యవసర విభాగంలోనే ఉండిపోవాల్సి వచ్చింది. తల్లిబిడ్డల విభాగంలో చేరే గర్భిణులు, ఇతర వైద్యం కోసం వచ్చే మహిళలు, చిన్న పిల్లలు కూడా ఇక్కడే అడ్మిషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. అనేకసార్లు ఇలా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఇక అర్థరాత్రి 12 దాటిందంటే సిబ్బందిలో కొంత మంది ఇళ్లకు వెళ్లిపోతారని చెప్పుకుంటున్నారు. గతంలో పని చేసిన అధికారులు అర్థరాత్రి వేళ, తెల్లవారు జామున ఆకస్మికంగా ఆసుపత్రిని తని ఖీ చేసేవారు. మెడికల్ కాలేజీగా అవతారం ఎత్తిన తరువాత తనిఖీలు చేయ డం లేదనే విమర్శలున్నాయి. ఉన్నతాధికారులు తక్షణం అత్యవసర విభాగంపై దృష్టి పెట్టి ఆసుపత్రికి వచ్చే రోగులకు సత్వర సేవలు అందే విధంగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన ఏడుకొండలు

ఏలూరు క్రైం, జూన్ 6 : హోం గార్డు మోటారు సైకిల్‌పై వెళ్తుండగా మరో మోటారు సైకిల్ వెనుక నుంచి వచ్చి ఢీ కొంది. ఈ ప్రమాదంలో హోంగార్డుతో పాటు ఢీ కొన్న మోటారు సైకిలిస్టు కూడా తీవ్ర గాయాలపాల య్యాడు ఏలూరు చొదిమెళ్లకు చెందిన యడ్ల ఏడుకొండలు (హెచ్‌జి 906) 16వ నెంబర్ జాతీయ రహదారిపై ఉన్న మూడో నెంబర్ సేఫ్టీ పోలీస్ పెట్రోలింగ్ వాహనంలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం రాత్రి కడుపునొప్పిగా ఉండడంతో టాబ్లెట్స్ తెచ్చుకోవడానికి కొవ్వలి వంతెన వద్ద నుంచి ఊరిలోకి వెళ్లే నిమిత్తం రాత్రి 9 గంటలకు మోటారు సైకిల్‌పై వెళుతుండగా వెనుక నుంచి మరో మోటారు సైకిలిస్టు ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో ఢీకొన్న మోటారు సైకిలిస్టు గుండుగొలను లోని సెల్ షాపు నిర్వహిస్తున్న తేరక ఈశ్వరరావుగా గుర్తించారు. వీరిద్దరిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి హైవే రోడ్డు సేఫ్టీ వాహనంపై తరలించారు. హోం గార్డు ఏడు కొండల పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో రాత్రి 10 గంటలకు ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్ పోస్టుకు సమాచారం ఇచ్చారు.

ఆ 2 కిలోమీటర్లు తప్ప

కొనసాగుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు

తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌లో కలిసే గ్రీన్‌ఫీల్డ్ హైవే రహదారి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ రహదారి ప్రారంభ దశలో కొన్ని ఆటంకాలు వచ్చినప్పటికి తర్వాత పనుల్లో వేగం పెరిగింది. రైతులు తమకు నష్టపరిహారం సరిపోవడం లేదంటూ మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలంటూ చింతలపూడి, కొయ్యలగూడెం మండలాల్లో అనేక ఉద్యమాలు చేపట్టారు. పనులను అడ్డుకున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం రూ.20 లక్షలు మాత్రమే నష్టపరిహారం ఇచ్చి పనులు మొదలు పెట్టేసింది. కొంత మంది తమ పొలాలను కన్వర్షన్ చేయించామని దానికి అనుగుణంగా నష్టపరిహారం ఇవ్వాలంటూ హై కోర్టుకు వెళ్లారు. ఆ భూముల్లో తప్ప మిగిలిన అన్ని చోట్ల పనులు శర వేగంగానే సాగుతున్నాయి. ఈ రహదారి వల్ల విశాఖపట్నం-హైదరాబాద్‌కు సుమారు 60 కిలోమీటర్ల దూరం తగ్గనుంది.



గణిజర్ల వద్ద తారు రోడ్డు నిర్మాణం



ఖమ్మం, దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి

కొయ్యలగూడెం/చింతలపూడి జూన్ 1: గ్రీన్‌ఫీల్డ్ హైవే రహదారి నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారుల నిర్మాణ శాఖ ద్వారా రూ.4,609 కోట్లతో అంచనాలు రూపొందించగా, ఐదు ప్యాకేజీలుగా విభజించి మూడు కంపెనీలు రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నాయి. ఈ రోడ్డు నిర్మాణం కోసం 1,411 ఎకరాల భూమి అవసరం కాగా ప్రభుత్వ భూమి 114 ఎకరాలు, రైతుల నుంచి 1,297 ఎకరాలు సేకరించారు. 2024 చివరి నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనులు వేగంగా జరుగుతున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దు గురుపట్లగూడెం నుంచి ఏలూరు జిల్లాలోకి ప్రవేశిస్తుంది. తెలంగాణ రాష్ట్రం చిత్తగూడెం నుంచి ఏలూరు జిల్లాలోని చింతలపూడి మండలం రేచర్ల వరకు

గ్రీన్‌ఫీల్డ్ హైవేపై కార్లు గంటకు 120 మీటర్లు, భారీ వాహనాలు 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేందుకు వీలుగా రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

కేఎంయూ కంపెనీ 44 కిలోమీటర్ల పనులను చేపట్టగా, రేచర్ల నుంచి తూర్పుగోదావరి జిల్లాలోని దేవరపల్లి వరకు 56.89 కిలోమీటర్ల పనులను బెక్కం కంపెనీ దక్కించుకుంది. రూ.1,555 కోట్లతో ప్రారంభించిన ఈ పనులు ఇప్పటి వరకు 60 శాతం పూర్తయినట్టు అధికారులు, కాంట్రాక్ట్ కంపెనీ చెబుతోంది. రేచర్ల, దేవరపల్లి మధ్య రేచర్ల, గుర్వాయిగూడెం, పొంగుటూరు, దేవరపల్లిలో జంక్షన్లు ఉన్నాయి.

కోర్టు పెండింగ్‌లో ..

ఈ రహదారి నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నప్పటికీ రెండు కిలోమీటర్ల మేర కోర్టు పెండింగ్‌లో ఉండడంతో ఆ ప్రాంతంలో పనులు జరగడం లేదు. కొయ్యలగూడెం మండలం యర్రంపేట, రాజవరం, కన్నాయిగూడెం గ్రామాల్లోని రైతులు తమ పొలాలకు కన్వర్షన్ చేయించామని, ఎకరాకు రూ.30 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని హైకోర్టుకు వెళ్లారు. ఈ మేరకు ఆ రెండు కిలోమీటర్లు మినహా మిగిలిన మొత్తం పనులు జరుగుతున్నాయి. దీని వలన 2024 సెప్టెంబరు నాటికి పూర్తికావాల్సిన పనులు ఇంకా కొన్ని నెలలు సమయం పట్టే అవకాశం ఉంది.

చింతలపూడిలో భూసేకరణ

గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణం కోసం చింతలపూడి మండలంలో అనేక గ్రామాల్లో భూసేకరణ జరిగింది. గురుపట్లగూడెం, లింగగూడెం, యండపల్లి, రాఘవాపురం, చింతకాయల కొత్తగూడెం, గణిజర్ల, వెంకటాద్రిగూడెం, వెంకటాపురం, నామవరం నుంచి శెట్టివారిగూడెం, రేచర్ల వరకు రోడ్డు నిర్మాణాలు పనులు జరుగుతున్నాయి. ఈ మార్గంలో పలు కల్వర్టులు, వంతెనలు, అండర్ పాస్ రోడ్లు 49 వరకు ఉన్నాయి. దీనిలో బాక్స్ కల్వర్టులు 29, చిన్నవాహనాలు అండర్ పాస్‌లు ఆరు, పెద్ద వాహనాల అండర్‌పాస్‌లు రెండు, ప్రజా రహదారులు ఐదు, మేజర్ బ్రిడ్జిలు నాలుగు, లైట్‌వెయిట్ అండర్ పాస్‌లు రెండు ఉన్నాయి. చింతకాయల కొత్తగూడెం వద్ద వాహనాల రెస్ట్ ప్లేస్ నిర్మాణం జరగాల్సి ఉంది. రేచర్ల వద్ద ఎంటర్ ఛేంజ్‌పాయింట్ ఏర్పాటు చేస్తారు. దీంతో ఏలూరు-హైదరాబాద్‌కి కూడా దూరం తగ్గుతుంది.

పరిహారం తక్కువ ఇచ్చారని రైతుల ఆందోళనలు

రోడ్డు నిర్మాణం కోసం జరిగిన భూసేకరణలో చింతల పూడి మండలంలోని రైతులు పలుమార్లు తమ విలువైన భూములు ఇచ్చినప్పటికీ పరిహారం తక్కువ ఇచ్చారని, తెలంగాణ ప్రాంతానికి ఎక్కువ ఇచ్చారని తమకు న్యాయం చేయాలంటూ నిరసనలు, పనులు అడ్డుకునే ప్రయత్నాలు జరిగాయి. ఈ మేరకు రోడ్డు పనులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. ఎట్టకేలకు కలెక్టర్ చొరవతో పరిహారం పెంచి ఇవ్వడంతో చాలావరకు రైతుల శాంతించారు. పొలాలకు వెళ్లేందుకు సర్వీస్ రోడ్లు వేయాలని, నిర్మాణం కోసం తిరుగుతున్న భారీ వాహనాల వల్ల ప్రస్తుతం ఉన్న రోడ్లు పాడై అధ్వానంగా మారుతున్నాయంటూ ప్రజల్లో ఆందోళన ఉంది. ఎండపల్లి వద్ద చెరువులో తీసిన గోతులు ఇంకా పూడ్చలేదని, గ్రామానికి చెందిన రైతు మోరంపూడి శ్రీనివాసరావు తెలిపారు. ఈ చెరువులో సింగిల్ కానా వంతెన నిర్మాణం వల్ల వరద నీరు పోటెత్తుతుందని ఆందోళన చేయడంతో రెండు కానాల వంతెన నిర్మాణం చేపట్టారు.

కూటమి రాకతో రియల్ జోష్

» ఊపందుకున్న ప్లాట్ల అమ్మకాలు » ఊపిరిపీల్చుకుంటున్న రియల్టర్లు » నిర్మాణరంగానికి ఊపు

» నూతన ఇసుక పాలసికై ఎదురుచూపులు



పాలకొల్లు, జూన్ 6 : అనూహ్య రీతిలో కూటమి విజయ బాహుట ఎగుర వేయడంతో నవ్యాంధ్రలో రియల్ జోష్ మొదలైంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పదుల సంఖ్యలో మదుపు దారులు అమరావతి ప్రాంతంలో పెద్ద మొత్తాలు వెచ్చించి స్థలాలు కొనుగోలు చేశారు. అయితే ఐదేళ్ల సైకో పాలనలో రాజధాని స్థిరస్వం లేకుండా చేయడంతో అమరావతి ప్రాంతంతో పాటు రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లోనూ రియల్ ఎస్టేట్ రంగం కుదేలు అయ్యింది. పెట్టుబడి పెట్టిన రియల్టర్‌లతో పాటు రియల్ ఎస్టేట్ డీలర్లు, అమ్ముకునే ఏజెంట్లు నష్టాల ఊబిలో కూరుకుపోయారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారితేనే రియల్ ఎస్టేట్ రంగానికి పూర్వ వైభవం వస్తుందని ఆ రంగంలో ఉన్నవ్యాపారులు బహిరంగంగానే చెప్పుకొచ్చారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో గడిచిన ఐదేళ్లలో రియల్ ఎస్టేట్ రంగానికి ఐదు వేల కోట్లు నష్టం వాటిల్లి ఉంటుందని అంచనా. ఏటా సుమారు వెయ్యి ఎకరాలో ఉమ్మడి జిల్లాల్లో లే అవుట్‌లు విస్తరించేవి. అయితే గడిచిన ఐదేళ్లలోనూ నూతనంగా వేసిన లేఅవుట్ల వెయ్యి ఎకరాలు మించదని ఆ రంగంలో ఉన్న నిపుణులు చెబుతున్నారు. అంటే రియల్ ఎస్టేట్ వ్యాపారం ఐదింట ఒకింతుకు పడింది. మరో వైపు ఇసుక కష్టాలతో భవన నిర్మాణ రంగం కుదేలు అయ్యింది.

వాస్తవంగా పశ్చిమ గోదావరి జిల్లా రాష్ట్రంలోనే రియల్ ఎస్టేట్ వ్యాపారానికి ముందంజలో ఉండేది. జగన్ రెడ్డి పాలన మొదలైన ఏడాదికే తిరోగమనం పట్టడంతో అధిక శాతం రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బిల్డర్‌లు హైదరాబాద్ వంటి నగరాలకు తరలి పోయారు. ఇపుడు నూతన ప్రభుత్వం ఏర్పడనుండడంతో మరలా ఇటు వైపు రియల్టర్లు దృష్టి సారిస్తున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే విశాఖపట్టణం, పరిసర ప్రాంతాల్లో 30 శాతం మేరకు ధరలు పడిపోయాయి. అమరావతి ప్రాంతంలో రెండు రోజుల వ్యవధిలోనే పది నుంచి 20 శాతం ధరలు పెరిగాయి. ఉమ్మడి జిల్లాల్లోని ఏలూరు కార్పొరేషన్‌తో సహా అన్ని పట్టణాల్లోనూ వందల సంఖ్యలో లే అవుట్లలో ఖాళీ స్థలాలు ఉన్నాయి. నాలుగేళ్లుగా స్థలాల్లో భవనాలు నిర్మించుకునే వ్యక్తులు మినహా వ్యాపార పరంగా అమ్మకాలు జరగలేదు. ఇపుడు ఎన్నికల ముగియడం, మార్కెట్‌లోకి పెద్ద ఎత్తున నగదు రావడంతో పెట్టుబడి దారులు స్థలాలు వైపు దృష్టి సారిస్తున్నారు. మొన్నటి వరకు ఉన్న ధరలకు మించి కేవలం రెండు రోజులు వ్యవధిలో పది శాతం మేరకు ధరలు పెరిగాయి. స్థలాలు వ్యక్తి గత భవనాలు అమ్మకాలు అగ్రిమెంట్‌లు వేగంగా జరుగుతున్నాయి.

కూటమి తరుపున చంద్రబాబు ఎన్నికలకు ముందు మరలా ఉచిత ఇసుక పాలసి అమలులోకి తెస్తామని వాగ్దానాలు చేశారు. అదే జరిగితే భవన నిర్మాణ రంగానికి పూర్వ వైభవం వస్తుంది. ఐదేళ్లుగా అమ్మకాలు లేక బిల్డర్‌లు నూతనంగా అపార్టుమెంట్‌లు వ్యక్తిగత భవన నిర్మాణాలు చేపట్టలేదు. ఇపుడు మరో రెండు నెలలు మూఢం ఉన్నప్పటికీ నిర్మాణ రంగం ఈ ఆర్థిక సంవత్సరంలో ఊపందుకుంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మూడవ త్రైమాసికంలో ధరలు మరింతగా పెరిగే అవకాశాలున్నాయని పరిశీలకులు చెబుతున్నారు. సెప్టెంబరు, అక్టోబరు నుంచి ముహూర్తాలు ఉండటం, అప్పటికి రాష్ట్రంలో పూర్తి స్థాయిలో పారదర్శకమైన పాలనతో ఇసుక, భవన నిర్మాణాలకు మరింత ఊతమి వచ్చే అవకాశం కనిపిస్తుంది. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే సుమారు మూడు వేల ఎకరాల్లో ఇండ్ల స్థలాలు నిరర్థకంగా ఉన్నాయి. సుమారు ఏలూరు పశ్చిమ గోదావరి జిల్లాల్లో 2,3 బెడ్‌రూమ్‌ల ప్లాట్‌లు 2,500 పై బడి ఉన్నాయి. ఇవన్ని అమ్మకాలు జరిగితే బిల్డర్లు మరింత ఉత్సాహంగా నిర్మాణాలు చేపట్టడానికి అవకాశం ఉంటుంది. ఇప్పటికే భవన నిర్మాణాలతో ముడిపడి ఉన్న సుమారు 30 రకాల అనుబంధ వ్యాపారాలు తగినంతగా లేక నీరశించిపోయాయి. ఉచిత ఇసుక పాలసి అమలులోకి వచ్చి బిల్డర్లు నిర్మాణాలు చేపట్టడం ప్రభుత్వ పరంగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుడితే జిల్లాలో ఏడాది తిరగకుండా రియల్ ఎస్టేట్ రంగానికి పూర్వ వైభవం వస్తుందని అంచనా వేస్తున్నారు.

చార్లెస్‌నగర్‌లో చిరుత అడుగుజాడలు



చింతలపూడి, జూన్ 6: స్థానిక చార్లెస్ నగర్‌లో చిరుతపులి అడుగు జాడలు కనిపించడంతో ఆ ప్రాంత వాసులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. కంచెనగూడెం ఫారెస్ట్ సీసీ కెమెరాలో వర్షం పడటం వల్ల కాలి ముద్రలు స్పష్టంగా కనిపించాయని చార్లెస్ నగరవాసులు చెబుతున్నారు.

పీఎం అవార్డుల ఎంపికకు కేంద్ర బృందం పర్యటన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్

ఏలూరు కలెక్టరేట్, జూన్ 6: ప్రైమ్ మినిస్టర్ అవార్డు ఫర్ ఎక్స్‌లెన్స్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్-2023 అవార్డుల ఎంపిక ప్రక్రియలో భాగంగా జిల్లాలో క్షేత్రస్థాయిలో ఈ నెలలో పర్యటించనున్న కేంద్ర బృందానికి సమగ్ర సమాచారాన్ని అందించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం అధికారులతో సమీక్షించారు. ఈ బృందం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల అమలు తీరును అధికారులు, లబ్ధిదారుల ద్వారా సమాచారం సేకరిస్తుందని తెలిపారు. క్షేత్ర స్థాయిలో లబ్ధిదారులకు కలిగిన ప్రయోజనాలను ఉత్తమ అభ్యాసాలను బృందం పరిశీలిస్తుందన్నారు. సంబంధిత పథకాలు, సమగ్ర వివరాలు, విజయగాథలను, ఫొటోలను సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో హౌసింగ్ రవికుమార్, ఆర్‌డబ్ల్యుఎస్‌ఈ ఎన్‌వీ సత్యనారాయణ, డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పురుగు మందు కలిసిన నీరు తాగి సైనికుడి మృతి



ఈతకోట హేమంత్‌కుమార్

పెదవేగి, జూన్ 6 : పురుగుమందు కలిసిన నీరు తాగి ఓ సైనికుడు మృతి చెందాడు. పెదవేగి ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం కూచింపూడికి చెందిన ఈతకోట హేమంత్ కుమార్ ఢిల్లీలో సైన్యంలో నాయక్‌గా పని చేస్తున్నాడు. అతను గత నెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికలకు ముందు ఢిల్లీ నుంచి స్వగ్రామం కూచింపూడి వచ్చారు. బుధవారం పొలానికి పురుగు మందు పిచికారీ చేయించారు. ఆ సమయంలో దాహం కావడంతో సీసాలో నీరు తాగాడు. అయితే పెద్ద డబ్బాలో ఉన్న పురుగు మందును సీసాలో వేసి పొలంలో పిచికారీ చేశారు. ఆ తరువాత సీసాలో మోటారు నీరు పట్టి ఉంచారు. ఈ విషయం తెలియని హేమంత్ కుమార్ సీసాలో ఉన్న నీటిని తాగేశాడు. కొద్దిసేపటికి అస్వస్థతకు గురికావడం, ఆపై అపస్మారక స్థితికి చేరుకోవడంతో బుధవారం సాయంత్రం అతనిని ఏలూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతున్న హేమంత్ కుమార్(35) గురువారం మధ్యాహ్నం మృతి చెందాడు. దీనిపై మృతుని తండ్రి రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. మృతుడు హేమంత్‌కుమార్‌కు భార్య వాణి, ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు.

పిడుగుపాటుకు మంటలు



దగ్ధమవుతున్న గొబ్బరి చెట్టు

మొగల్తూరు, జూన్ 6: శివాలయం సమీపంలో ఒక కొబ్బరి చెట్టుపై బుధవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో పిడుగు పడటంతో ఆ చెట్టు నుంచి భారీ మంటలు వ్యాపించాయి. దీంతో స్థానికులు తీవ్ర భయందోళన చెందారు. నివాసాల్లోని ఫ్యాన్లు, లైట్లు, ఏసీలు, టీవీలు, ఇన్వెర్టలు కాలిపోయాయి. మొగల్తూరు జాతీయ రహదారి వెంబడి గల పలు దుకాణాల్లోనూ విద్యుత్ సామగ్రి కాలిపోయిందని వ్యాపారులు తెలిపారు. ఒక్కసారిగా ఇంత స్థాయిలో వర్షం కురవగా మొగల్తూరులో 63.2 మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదైంది. చలిగాలులతో చేప, రొయ్యల చెరువుల్లో ఆక్సిజన్ లోపంతో మత్స్య సంపద వడ్డుకు రావడం, చేతికి అందిన మామిడి ఫలసాయం నేల రాలింది. ఆరు తడి సాగు చేసిన మినుము, పెసలు చేలు వాలిపోయాయి.

ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య



మృతుడు ఆశీర్వాదం (ఫైల్)

లింగపాలెం, జూన్ 6: ప్రియుడితో కలిసి తన భర్తను హత్య చేసిన భార్య ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం లింగపాలెం మండలం వేములపల్లి గ్రామానికి చెందిన సుమలత అనే మహిళ తన భర్తను ప్రియుడితో కలిసి ఉరివేసి చంపినట్లు తెలిపారు. చిట్టిమాల ఆశీర్వాదం (28) జేసీబీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తన భార్య సుమలత ఏలూరు శివారు కొప్పాక గ్రామానికి చెందిన ఒక వ్యక్తితో పరిచయం ఏర్పడి, అతనితో అక్రమ సంబంధం కొనసాగిస్తుందని తెలిపారు. వీరిద్దరు కలిసి మూడు రోజుల క్రితం ఆశీర్వాదానికి నిద్ర మాత్రలు వేసి అతను నిద్రపోయిన అనంతరం వైరుతో మెడ బిగించి హత్య చేశారన్నారు. అనంతరం ఎవరికి అనుమానం రాకుండా ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులను, గ్రామస్తులను నమ్మించారని తెలిపారు. కుటుంబ సభ్యులు మృతదేహానికి అంత్యక్రియలు జరిపారు. అనంతరం ఆమె ప్రవర్తనపై అనుమానం రావడంతో ఆమె ఫోన్‌ను పరిశీలించగా ఫోన్‌లో ఆమె ప్రియుడు నాగరాజుతో కలిసి దిగిన ఫొటోలను చూసి ఆమెను గట్టిగా నిలదీయడంతో తానే చంపినట్లు ఒపుకుందన్నారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. పోలీసులు కేసున మోదు చేసి మృతదేహాన్ని బయటకు తీసి తహసీల్దార్, సీఐ సుధాకర్, ఎస్ఐ చెన్నారావు ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి



మృతి చెందిన ఉపాధి కూలీ శివశంకరమూర్తి

అత్తిలి, జూన్ 6 : ఉనికిలి గ్రామంలో పంట కాలువ పూడికతీత పనుల్లో పాల్గొన్న ఉపాధి హామీ కూలీ వీరవల్లి శివశంకరమూర్తి పని ప్రదేశంలో గుండె పోటుతో గురవారం మృతి చెందాడు. పని ప్రదేశాన్ని అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఫణి రాజు, టెక్నికల్ అసిస్టెంట్ నవ్యలత, స్వరూప్ సందర్శించారు. మృతుని కుటుంబానికి ఉపాధి హామీ పథకం చట్ట ప్రకారం రావాల్సిన సహాయం అందించేలా జిల్లా అధికారులకు నివేదికలు పంపుతామని తెలిపారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వృద్ధుడు

ఏలూరు క్రైం, జూన్ 6 : జాతీయ రహదారిపై మూర్ఛవ్యాధి వచ్చి అకస్మాత్తుగా పడిపోయిన వృద్ధుడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. వారం రోజుల క్రితం హనుమాన్ జంక్షన్‌లోని విజయవాడ రోడ్డులో మాసిన జుత్తు, చిరిగిన దుస్తులతో, రోడ్డు పై తిరుగుతూ ఉండగా అక్కడి వారు స్నానం చేయించి అతనికి క్రాఫ్ చేయి ంచి దుస్తులను వేశారు. ఆ తరువాత ఆ ప్రాంతంలో తిరుగుతూ ఫిట్స్ వచ్చి పడిపోయాడు. అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా గురువారం ఉదయం మృతి చెందాడు. మృత దేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీ లో భద్రపరిచారు. వివరాలు తెలిసిన వారు ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఔట్ పోస్టు పోలీసులకు, ఆసుపత్రి సిబ్బందికి గాని తెలియజేయాల్సి ఉంది.

టీడీపీకి మద్దతిచ్చావంటూ మహిళపై దాడి

ముసునూరు, జూన్ 6: తెలుగుదేశం పార్టీకి మద్దతిస్తారా? మేమంటే భయం లేదా? అంటూ సర్పంచ్ భర్త, ఎంపీటీసీ కలసి తమ ఇంటిపై దాడికి దిగారంటూ ముసునూరు మండలం బలివేకు చెందిన మహిళ ముసునూరు పోలీసులను గురువారం ఆశ్రయించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బలివేకు చెందిన తోట ఆంజనేయులు కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. ఇతని భార్య వెంకట లక్ష్మి. తాము టీడీపీ పక్షాన ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం, టీడీపీ గెలుపొందడాన్ని జీర్ణించుకోలేక సర్పంచ్ భర్త రావు సుధాకర్, ఎంపీటీసీ దాసరి సుమన్‌లతో పాటు నాయుడు స్వర్ణకుమార్, మట్టా రమేష్, నాయుడు దుర్గాప్రసాద్, ఈడా నాగయ్య, యార్లగడ్డ దుర్గాప్రసాద్ కత్తులు, కర్రలతో బుధవారం రాత్రి తమ ఇంటిపై దాడిచేసి తమను చంపుతామంటూ భయభ్రాంతులకు గురి చేశారని వెంకట లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన భర్త స్థానికంగా లేని సమయంలో తనపై ఈ విధంగా దాడికి దిగడం, ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని తక్షణం తనకు, తన భర్తకు పోలీసులు ప్రాణ రక్షణ కల్పించాలని, దాడి చేసిన వారిపై చర్యలు చేపట్టాలని ఫిర్యాదులో కోరింది. ఎస్ఐ పి.వాసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

టి.నరసాపురం, జూన్ 6: సారా విక్రయిస్తున్న వ్యక్తి పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి.దుర్గా మహేశ్వరరావు తెలిపారు. ఆయన గురువారం తెలిపిన వివరాల ప్రకారం రాజు పోతేపల్లి గ్రామంలో సారా విక్రయిస్తున్నారనే సమాచారంతో గురువారం తన సిబ్బందితో స్థావరం పై దాడి చేశామన్నారు ఈ దాడిలో 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

నరసాపురంలో సమష్టి విజయం

భారీ మెజార్టీకి ఇదే రహస్యం


నరసాపురంలో ఐక్యత చాటుతున్న కూటమి నాయకులు (ఫైల్)

నరసాపురం, జూన్ 6: నరసాపురం నియోజకవర్గం చరిత్రలో కూటమి అభ్యర్థిగా బరిలో నిలిచిన జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్ భారీ మెజార్టీ సాధించారు. 1999లో మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి కలవకొలను తులసీపై 35వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఆ తరువాత సుమారు 50వేల మెజార్టీతో గెలుపొందిన ఘనత నాయకర్‌కే దక్కింది. దీనికి కూటమి పార్టీల సమష్టి కృషి, గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వ అరాచకాలు, ఆపార్టీ అనుసరించిన ప్రజా వ్యతిరేఖ విధానాలపై తెలుగుదేశం, జనసేన, బీజేపీలు పలు పోరాటాలు చేశాయి. ఈనేపథ్యంలో ఆపార్టీ నాయకులు పలు కేసుల్ని కూడా ఎదుర్కొన్నారు. మాజీ మంత్రి కొత్తపల్లిపై ఏడు కేసులు, మాజీ ఎమ్మెల్యే బండారుపై 15కేసులు, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరిపై ఏడు కేసులు నమోదు అయ్యాయి. ఇటు పొత్తు కుదరక ముందు వరకు టిక్కెట్‌పై తీవ్ర పోటీ ఏర్పడింది. టీడీపీ నుంచి పొత్తూరి, కొవ్వలినాయుడు, మాజీ ఎమ్మెల్యే బండారు, జనసేన నుంచి కొత్తపల్లి కూడా పోటీపడ్డారు. అయితే సమీకరణలో సీటు నాయకర్‌కు దక్కింది. అయినప్పటికీ నేతలంతా నాయకర్ విజయానికి కృషి చేశారు. ఇంటింటికి ప్రచారాన్ని నిర్వహించారు. ఇదే కూటమికి బాగా కలిసొచ్చింది. గతంలో ఎన్నడూ ఇన్ని పార్టీలు కలిసి అభ్యర్థి విజయానికి ప్రచారాలు నిర్వహించలేదు. పార్టీలు, రాజకీయ సీనియార్టీని పక్కన్న పెట్టి విజయమే లక్ష్యంగా పని చేశారు. ఇది బొమ్మిడికి బాగా కలిసొచ్చింది. భారీ మెజార్టీకి కారణమైంది. గత ఎన్నికల్లో ఎన్నో హామీలిచ్చిన వైసీపీ ఐదేళ్లల్లో ఒక్కటికి కూడా చేపట్టలేదు. జిల్లా కేంద్రం తరలిపోయింది, మెడికల్ కాలేజీతో పాటు ముఖ్యమంత్రి జగన్ శంకుస్థాపన చేసిన రూ.3200 కోట్లు పనులు కూడా పునాదికే పరిమితయ్యాయి. వీటితో పాటు ముదునూరి అవినీతి కూడా ప్రచారంలో నేతలు ఎండగట్టారు. ప్రభుత్వంపై వ్యతిరేకతో ఉన్న ప్రజలు నేతలకు మద్దతుగా నిలిచారు. పట్టణ, మండలంలో కూడా వార్ వన్‌సైడ్ అయింది. కౌంటింగ్‌లో 12 రౌండ్లలోనూ నాయకర్ మెజార్టీ సాధించడం గమనార్హం. మెజార్టీపై వేసిన అంచనాలు కూడా తారుమారయ్యాయి. పోలింగ్ తరువాత 30వేలు మెజార్టీ వస్తుందని లెక్కగట్టారు. అయితే ఈవీఎంల్లో 50వేలు నమోదు అవ్వడం అందర్ని ఆశ్చర్యానికి గురి చేసింది. ప్రత్యర్థి ముదునూరి, ప్రభుత్వం ఈ స్థాయిలో వ్యతిరేకత ఉంటుందని వైసీపీ శ్రేణులు కూడా అంచనా కట్టలేకపోయారు. ఇటు పోస్టల్ బ్యాలెట్‌లోనూ 1040 ఓట్లు మెజార్టీ సాధించడం కూటమి నేతల సమష్టి కృషే. మరోవైపు బీజేపీ ఎంపీ శ్రీనివాసవర్మకు కూడా భారీ స్థాయిలో మెజార్టీ లభించింది. క్రాస్ ఓటింగ్ జరుగుతుందని అంతా భావించారు. అయితే ఊహించని స్థాయిలో క్రాస్ ఓటింగ్ జరగలేదు. అంతా కూటమి పక్షానే నిలిచి బీజేపీకి పట్టం కట్టారు.

అధికారులకు అభినందనలు

ఉండి, జూన్ 6: సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వహించినందుకు అన్ని శాఖల అధికారులకు అభినందనలు తెలియజేస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టరు, ఉండి రిటర్నింగ్ అధికారి సీవీ ప్రవీణ్‌ఆదిత్య అన్నారు. గురువారం పత్రికలకు ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గంలో శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలుగకుండా ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు నిర్వహించి పూర్తిచేయడం అభినందనీయమన్నారు. సుమారుగా 6నెలలు నుంచి బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారన్నారు. ఉండి తహసీల్దారు శ్రీనివాస్, ఎంపీడీవో రవీంద్ర ఇతర అధికారులు అందించిన సహకారం మరువలేమన్నారు.

ఆచంట: ఆచంట నియోజకవర్గంలో పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రశాంత వాతావరణంలో జరిగిందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి. స్వామి నాయుడు అన్నారు. ఎన్నికల నిమిత్తం సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల షెడ్యూలు నుంచి కౌంటింగ్ అయ్యే వరకు ఎటువంటి అవాంచనీయ సంఘటనలకు తావు లేకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన సిబ్బంది సేవలను అభినందించారు. ప్రశాంతంగా ఎన్నికలు జరగడానికి సహకరించిన రాజకీయ పక్షాలు, అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు, మీడియా ప్రతినిధులకు ఆర్‌వో ధన్యవాదాలు తెలిపారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

ఆకివీడు, జూన్ 6: గుండెపోటుతో ఉపాధ్యాయుడు చందన ప్రభాకర్ గురువారం (52) మరణించారు. ప్రభాకర్ కోళ్ళపర్రు ఎంపీయూపీ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో గుండెకు సంబంధించి ఓపెన్ సర్జరీ చేయించుకున్నారు. ఈయన భార్య, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు, పలువురు ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బురదగా జాతీయ రహదారి

ఆకివీడు, జూన్ 6: చిన్నపాటి వర్షానికే అజ్జమూరులో జాతీయ రహదారి బురదగా మారింది. బుధవారం రాత్రి కురిసిన చిన్నపాటి వర్షం నీళ్ళు గోతుల్లో నిలవడంతో బురదగా మారి స్థానికులు, ప్రయాణికులు, వాహనదారులు అనేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

ఆసుపత్రిలో పింఛన్ అందజేత


ఆసుపత్రలో చికిత్స పొందుతున్న బాధితుడి భార్యకు పింఛన్ అందిస్తున్న సచివాలయ ఉద్యోగి

ఆకివీడు, జూన్ 6: ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు భార్యకు సచివాలయ ఉద్యోగి శ్రీలక్ష్మి పింఛన్ అందజేశారు. బ్యాంకులో అకౌంటు లేని వారి ఇంటికి వెళ్ళి పింఛన్లు అందజేయాల్సి ఉంది. పెదకాపవరానికి చెందిన యార పాటి రంగారావు తీవ్ర కీళ్ళనొప్పులు, పక్షవాతం సమస్యతో సుమారు ఇరవై రోజు ల నుంచి చికిత్స పొందుతున్నారు. సచివాలయ ఉద్యోగి శ్రీలక్ష్మి ఆసుపత్రికి వెళ్ళి బాధితుడు భార్యకు పింఛన్ అందచేశారు.

వైసీపీ ఓటమితో చీకట్లు తొలగాయి

ఆకివీడు, జూన్ 6: ఓటర్లు కూటమికి అఖండ మెజార్టీ అందించడంతో ఏపీకి చీకట్లు తొలగాయని జనసేన నేత, న్యాయవాది జడ్డు దుర్గా ప్రసాద్ అన్నారు. గురువారం బహిరంగ ప్రదేశంలో ఫ్యాన్ రెక్కలు విరిసి కాలుతో కసి తీరా తొక్కుతూ మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అధికారం సొంతమనుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరించిందన్నారు. చీటికిమాటికి ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచే సిందన్నారు. ఇక ఏపీలో వైసీపీ కనబడదన్నారు.

టీడీపీ నాయకుల సంబరాలు


ఆకివీడులో టీడీపీ,జనసేన నేతలను గజమాలతో సత్కరిస్తున్న కార్యకర్తలు

ఆకివీడు, జూన్ 6: టీడీపీ కూటమిని ప్రజలు నిండుమనసుతో ఆశీర్వదించారని టీడీపీ మండలాధ్యక్షుడు మోటుపల్లి రామవర ప్రసాద్ అన్నారు. కూటమి విజయాన్ని కాంక్షిస్తూ టీడీపీ, జనసేన అభిమానులు, కార్యకర్తలు రామవర ప్రసాద్, జనసేన-టీడీపీ పట్టణ అధ్యక్షులు పిల్లా బాబులు, బొల్లా వెంకట్రావు, క్లస్టర్ ఇన్‌చార్జి గొంట్లా గణపతిని గజమాలతో సత్కరించారు. కేక్ కట్ చేయించి ర్యాలీ నిర్వహించారు.

పార్టీ శ్రేణులకు తగిన గుర్తింపు: పత్సమట్ల


ఎమ్మెల్యే ధర్మరాజును సత్కరిస్తున్న కూటమి నాయకులు, కార్యకర్తలు

గణపవరం, జూన్ 6: తన విజయానికి కృషి చేసిన పార్టీ శ్రేణులకు ఎల్లప్పుడు తగిన గుర్తింపు ఉంటుందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. కూటమి నేతలు, కార్యకర్తలు పత్సమట్ల ధర్మరాజును గురువారం క్యాంపు కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. మండల టీడీపీ అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, ఉంగుటూరు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు అద్దేపల్లి వాసురాజు, జిల్లా కార్యదర్శి యాళ్ళ సుబ్బారావు, జల్లికాకినాడ టీడీపీ అధ్యక్షుడు దండు బాబ్జీరాజు, గణపవరం పట్టణ టీడీపీ అధ్యక్షుడు కూసంపూడి సురేంద్రకుమారరాజు, పట్టణ యువత అధ్యక్షుడు కాపారం చిన్న, మాజీ సర్పంచ్ కొప్పిశెట్టి ఏసుబాబు, పార్టీ నాయకులు ఇందుకూరి మాద్రాజు, జనసేన మండల నాయకుడు తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దోమల వల్లనే వ్యాధులు



మలేరియాపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం, జూన్ 6: ప్రస్తుతం మారుతున్న వాతావరణంతో మలేరియా, డెంగీ తదితర వ్యాధులు దోమల వల్లనే ప్రబలుతున్నాయని గణపవరం, పిప్పర ప్రభుత్వ వైద్యాధికారులు సంతోష్‌కుమార్, కిరణ్మయి అన్నారు. మలేరియా వ్యతిరేక దినం సందర్భంగా గణపవరం, కేశవరం పీహెచ్‌సీల ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహించారు. ఎంపీహెచ్‌ఓలు జలాది విల్సన్‌బాబు, వెంకటేశ్వర్లు, వీఆర్వో కేశవమూర్తి, రామారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోరాట యోధుడు చంద్ర రాజేశ్వరరావు

భీమవరం అర్బన్, జూన్ 6: పీడిత వర్గాల అభ్యున్నతికి ఆర్థిక, సామాజిక అంతరాలు లేని సమసమాజ స్థాపనే లక్ష్యంగా జీవితాంతం కృషి చేసిన పోరాట యోధుడు చంద్ర రాజేశ్వరరావు అని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. సీపీఐ అగ్ర నేత చంద్ర రాజేశ్వరరావు జయంతి సందర్భంగా గురువారం భీమవరం శ్రీనివాస ది యేటర్ సెంటర్లో సీపీఐ స్థూపం వద్ద చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి సీపీఐ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాం ప్రసాద్, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి తదితరులు పాల్గొన్నారు.

కత్తితో దాడికి యత్నం

ఉండి, జూన్ 6: కత్తితో దాడికి యత్నించిన వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎన్‌ఆర్‌పిఅగ్రహారానికి చెందిన కిన్నెర వెంకన్న ఉండికి చెందిన పామర్తి నాగరాజులకు గతంలో గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నాగరాజు అతని స్నేహితులు నాగబాబు, సాయిరాం కలిసి ఎన్‌ఆర్‌పిఅగ్రహారంలోని వెంకన్న ఇంటికి గురువారం మధ్యాహ్నం వెళ్లి కత్తితో దాడి చేయడానికి ప్రయత్నించారు. ఈదాడి నుంచి బాధితుడు తప్పించుకుని పోలీసుస్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడు.

అభివృద్ధికి కలసి కట్టుగా పనిచేద్దాం


కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం టౌన్, జూన్ 6 : సార్వత్రిక ఎన్నికల్లో భీమవరం నియోజకవర్గం నుంచి విజయం సాధించిన జనసేన పార్టీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీని కలిశారు. భీమవరం అభివృద్ధికి కలిసి కట్టుగా పని చేద్దామని, మీకు మా సహ కారం ఎప్పుడు ఉంటుందని, ఎల్లప్పుడూ అందుబాటులోనే ఉంటానని అన్నారు. భీమవరం అభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్యను కూడా కలిశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, ఆకుల కృష్ణ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు స్వీప్ యాక్టివిటీస్ అభినందన



భీమవరం టౌన్, జూన్ 6 : జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్యలను స్వీప్ యాక్టివిటీస్ ఆధ్వర్యంలో అభినందన సత్కారం చేశారు. సార్వత్రిక ఎన్నికలు సజావుగా సాగడానికి చిత్తశుద్ధితో పని చేసి వృత్తి ధర్మాన్ని పాటిస్తూ ఎవరిని నొప్పించకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించిన జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అభినందనీయులని స్వీప్ యాక్టివిటీస్ బ్రాండ్ అంబాసిడర్ చెరుకువాడ రంగసాయి, లయన్స్‌క్లబ్ నాయకులు కంతేటి వెంకటరాజు అన్నారు.

మావుళ్ళమ్మ ఆలయానికి బంగారం అందజేత



భీమవరంటౌన్, జూన్ 6: మావుళ్ళమ్మ అమ్మవారికి తెనాలికి చెందిన హేమంత్, కావ్యశ్రీ దంపతులు 10 గ్రాముల బంగారం అందించారు. దాతలు అమ్మవారిని దర్శించుకోగా ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లిఖార్జున శర్మ పూజలు చేసి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం బంగారాన్ని ఆలయ ఈవో బుద్ధమహాలక్ష్మి నగేష్‌కు అందించారు. దేవస్థానం తరుపున శేష వస్త్రాన్ని, ప్రసాదాన్ని అందించారు. అదే విధంగా భీమవరానికి చెందిన అనిల్ కుమార్ సాయి ప్రవల్లిక దంపతులు 8 గ్రాముల బంగారం అందించారు.

మలేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలి



తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 6: ప్రజలు మలేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలని వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి రూపాదేవి అన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా వెంకట్రామన్నగూడెంలో గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచి దోమల వ్యాప్తి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సామాజిక ఆరోగ్య అధికారి సూర్యకాంతం, ఆరోగ్య పర్యవేక్షకులు జి. పద్మలత తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తణుకు, జూన్ 6: వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు డీఈ సీహెచ్.రామకృష్ణ తెలిపారు. బ్యాంకు కాలనీ, సూర్యాలయం వీధి, రామకృష్ణ సేవా సమితి, సజ్జాపురం, ఇరగవరం కాలనీ, టోల్‌గేట్ ఏరియా, అక్షయ నగర్, శివబాలాజీ నగర్, లక్ష్మి గణేశ్ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

పోరాటాలకు సమాయత్తం కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

తణుకు, జూన్ 6: కొబ్బరి దింపు కార్మికులు తమ హక్కుల సాధనకు సంఘటిత పోరాటాలకు సమాయత్తం కావాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు అన్నారు. గురువారం సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కోనాల భీమారావు, అధ్యక్షుడిగా బొక్కా సత్యనారాయణ, కార్యదర్శిగా పెచ్చేటి శ్రీను, కోశాధికారిగా కౌరు శ్రీనులను ఎన్నుకొన్నారు.



అంగన్వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

అత్తిలి, జూన్ 6 : ఐసీడీఎస్ తిరుపతిపురం సెక్టార్ శివపురంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రీ స్కూలు నుంచి ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయ్యే విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడంతోపాటు బహుమతులు ఇచ్చి సత్కరించారు. పిల్లల్లో మేధస్సు, సృజనాత్మకతసైపర్యవేక్షురాలు ఎం. శ్రీదేవి తెలిపారు. విద్యార్థుల పేరిట మొక్కలు నాటారు. అంగన్‌వాడీ కార్యకర్త పి. మాధవి, సహాయకురాలు మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి పైనాపిల్ పండ్లతో అలంకారం



భీమవరం టౌన్, జూన్ 6 : మెంటేవారి తోటలోని బాలా త్రిపుర సుందరీ అమ్మవారి ఆలయంలో అమావాస్యను పురస్కరించుకుని అమ్మవారికి విశేష పూజలు, హోమాలు, నిర్వహించారు. అనంతరం పైనాపిల్ పండ్లతో అలంకారం చేశారు.

నేడు వేసవి విజ్ఞాన శిక్షణ ముగింపు

నరసాపురం టౌన్, జూన్ 6: పట్టణంలోని అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో శుక్రవారం వేసవి విజ్ఞాన శిక్షణ ముగింపు సభ నిర్వహిస్తున్నట్లు లైబ్రరీ అధికారి కుమారి తెలిపారు. గురువారం గ్రంథాలయంలో కథలు, పుస్తక పఠనం, ఆత్మ విశ్వాసం తదితర అంశాలపై రిసోర్స్‌పర్సన్ అవగాహన కల్పించారు. పండా త్రినాథ్, ధవేజీ, సుబ్బారావు, సుదీర్‌మోహన్, సూర్యంబాబు, జీవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయంపై పొత్తూరికి అభినందనలు


పొత్తూరికి బొకే అందిస్తున్న పార్టీ శ్రేణులు

నరసాపురం టౌన్, జూన్ 6: ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి భారీ విజయంపై టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజుకు అభినందనలు తెలిపారు. గురువారం లలితాంబ రేవులో నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు కలిసి బొకేలందించారు. నరసాపురంలో జనసేన అభ్యర్థి నాయకర్ విజయంపై పొత్తూరి చేసిన కృషి ఎనలేనిదన్నారు. అందరి కృషితోనే కూటమి విజయం సాధించిందని పొత్తూరి అన్నారు. కార్యక్రమంలో జక్కం శ్రీమన్నారాయణ, జోగి పండు, వాతాడి ఉమా, ఆనందబాబు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రలో కొత్త కోర్సులు

నరసాపురం రూరల్, జూన్ 6: మండలంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ ఆటానమస్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి నూతన కోర్సులు ప్రవేశపెట్టినట్టు కళాశాల చైర్మన్ కె.సత్యనారాయణ, కోశాధికారి త్రినాథ్, డైరెక్టర్ శ్రీహరి, ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్ తెలిపారు. బీబీఏ, బీఎంఎస్, బీసీఏ వంటి కోర్సులు ఉన్నాయన్నారు.

ఎమ్మెల్యే బొమ్మిడికి బీజేపీ అభినందనలు



నరసాపురం, జూన్ 6: కూటమి అభ్యర్థిగా గెలుపొందిన బొమ్మిడి నాయకర్‌ను గురువారం బీజేపీ నాయకులు కలిసి అభినందించారు. ఆపార్టీ కన్వీనర్ మేకల సతీష్ ఆధ్వర్యంలో నాయకర్‌కు బొకే అందించారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ తన విజయవానికి సమష్టి కృషే కారణమన్నారు. అందరిని కలుపుకుని నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలి


రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరావు

నరసాపురం, జూన్ 6: పట్టణంలోని వాటర్‌వర్క్స్‌ను గురువారం కమిషనర్ వెంకటేశ్వరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. నీటి శుద్ధి, స్టోరేజ్, రికార్డులను పరిశీలించారు. మరో మూడు రోజుల్లో పంట కాల్వలకు నీరు విడుదల చేస్తున్నందున మోటార్లను సిద్ధం చేయాలన్నారు. రిజర్వాయర్ నిండిన తరువాత పవర్ కట్‌ను నిలిపివేసి రెండు పూటల నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. నీటి శుద్ధి పూర్తిస్థాయిలో చేయాలన్నారు. టెస్టింగ్ చేసిన తరువాత పైప్‌లకు విడుదల చేయాలన్నారు.

కూటమి కార్యకర్తల హుషారు



గొల్లలకోడేరులో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి నాయకులు

పాలకోడేరు, జూన్ 6: తెలుగుదేశం పార్టీ తరపున కూటమి అభ్యర్థిగా పోటీ చేసి భారీ మెజారిటీ సాధించిన కనుమూరి రఘురామకృష్ణరాజు విజయం పట్ల తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు గొల్లలకోడేరులో టీడీపీ నాయకుడు కామన రాంబాబు, కమ్మిలి రాంబాబు, గాదిరాజు సూర్యనారాయణ రాజు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వందలాది మందితో భారీ బైక్‌ర్యాలీతో పాటు భారీ సౌండ్‌సిస్టమ్‌తో బాణసంచా కాల్చుతూ గొల్లలకోడేరు గ్రామంలో పురవీధుల్లో కేరింతలు కొట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్టీ నాయకుడు సారా మల్లేశ్వరరావు, కొండపల్లి ఏసురత్నం, వెంకటేశ్వరరావు, జుత్తిగ శ్రీను, తంగెళ్ళ శ్రీను, ప్రసాద్, రాజు, తదితర బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో మరింత బాధ్యత పెరిగింది



తణుకు, జూన్ 6: భారీ మెజార్టీతో తన బాధ్యత మరింత పెరిగిందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. గురువారం ఉదయం నుంచి టీడీపీ కార్యాలయం కార్యకర్తలు, అభిమానులతో సందడిగా మారింది. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున విచ్చేసి అభినందనలు తెలిపారు. ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణతులసికి పలువురు మహిళలు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. తణుకు సిటీ కేబుల్ ఎండీ చిట్టూరి కృష్ణ కన్నయ్యతో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధి నా బాధ్యత : బొలిశెట్టి


ఎమ్మెల్యే బొలిశెట్టికి జ్ఞాపిక అందిస్తున్న ఉద్యాన యూనివర్సిటీ ప్రతినిధులు

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 6: తాడేపల్లిగూడెం నియోజకవర్గ ప్రజలు తనకు అత్యధిక మెజార్టీ అందించి తనపై పెద్ద బాధ్యత పెట్టారని అభివృద్ధే తన లక్ష్యమని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. తన నివాసంలో గురువారం కూటమి నాయకులతో కలసి విలేకరులతో మాట్లాడుతూ రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని ఒక మోడల్‌గా తీర్చిదిద్దుతాం అన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి మాట్లాడుతూ నియోజకవర్గం ఏర్పడిన తరువాత ఇంత భారీ విజయం ఏ అభ్యర్థికీ రాలేదని తన మిత్రుడికి అంతటి విజయాన్ని అందించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ మాట్లాడుతూ ఎంపీగా శ్రీనివాస వర్మను, ఎమ్మెల్యేగా బొలిశెట్టి శ్రీనివాస్‌ను అఖండ మెజారిటీతో గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటామన్నారు.

మంచినీటి సమస్య రానివ్వద్దు

నియోజకవర్గంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు సూచించారు. ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసిన అధికారులతో ఆయన చర్చించారు. పసర్లు వచ్చిన మంచినీటి చెరువులు పరిశీలించి ప్రజలకు సురక్షిత నీరు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఉద్యాన వర్సిటీ వీసీ డాక్టర్ జానకిరామ్ బొలిశెట్టిని మర్యాదపూర్వకంగా కలిశారు. రిజిస్ట్రార్ బి శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా: అంజిబాబు

భీమవరం టౌన్, జూన్ 6 : మోడల్ నియోజకవర్గంగా భీమవరాన్ని తీర్చిదిద్దుతానని జనసేన ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. భీమవరంలో ఆయన గురువారం పార్టీ కార్యాయలంలో విలేకరులతో మాట్లాడారు. గతంలో 10 ఏళ్ళపాటు ఎమ్మెల్యేగా పని చేశానని, అప్పట్లో ఎలాంటి దౌర్జన్యాలు, అరాచకాలకు తావులేకుండా పాలన సాగిందన్నారు. భీమవరంలో ప్రధాన సమస్య చెత్తవేసేందుకు డంపింగ్ యార్డు స్థలం లేకపోవటమేనన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా రింగ్‌రోడ్డు నిర్మాణం, యువతను చదువుతోపాటు క్రీడల్లో రాణించేలా మినీ స్టేడియం అందుబాటులోకి తీసుకువస్తానన్నారు. భీమవరంలోని 39 వార్డులతోపాటు, వీరవాసరం, భీమవరం మండలల్లో అన్ని గ్రామాలకు శివారు ఉన్న ఇంటికి కూడా తాగునీటిని అందిస్తానన్నారు. సాగునీటి కష్టాలులేకుండా డ్రెయిన్‌లను ప్రక్షాళన చేస్తానని అన్నారు. చాలా చోట్ల ఆక్రమణలు ఉడటంతో కుచించుకుపోయాయని, వాటిని తొలగించి పూర్తి స్థాయి డ్రెయిన్‌లు ఏర్పాటు చేస్తానని ఇందుకు ప్రత్యేక దృష్టి పెడతానన్నారు.

బ్రాహ్మణులకు అండగా ఉంటా

భీమవరం టౌన్: భీమవరం నియోజకవర్గంలో బ్రాహ్మణులకు ఎటువంటి సమస్యలు వచ్చినా వాటిని పరిష్కరించటంతోపాటు వారికి తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. గురువారంనాడు పార్టీ కార్యాలయంలో అంజిబాబును గునుపూడి బ్రాహ్మణ సమాఖ్య సభ్యులు కలసి అఖండ విజయం సాధించిన ఆయనను అభినందించటంతో పాటు ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షుడు వేలూరి కిరణ్ శర్మ, చెరుకుపల్లి సంతోష్ శర్మ, బ్రహ్మజోశ్యుల సుబ్రహ్మణ్యశర్మ, సత్యప్రసాద్ శర్మ, చందూరి కామేష్, మారెళ్ళ అఖిలేష్, బొల్లా ప్రగడశేషు, మదిర అయ్యప్ప పాల్గొన్నారు.

పితానికి కూటమి నాయకుల అభినందన


ఎమ్మెల్యే పితానిని కలిసిన అంగర, తదితరులు

పోడూరు, జూన్ 6 : ఆచంట శాసన సభ్యునిగా విజయం సాధించిన మాజీ మంత్రి పితాని సత్యనారాయణను మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ గురువారం పితాని నివాసం కొమ్ముచిక్కాలలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అంగర వీరభద్ర కుమార్ (చిన్న), కోడి విజయభాస్కరరావు, ఇతర కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆచంట: ఆచంట టీడీపీ కూటమి అభ్యర్థి పితాని సత్యనారాయణ భారీ మెజార్టీతో విజయం సాధించడంతో ఇంకా అనేక మంది కూటమి శ్రేణులు పితాని నివాసానికి వెళ్ళి అభినందనలు తెలుపుతున్నారు. వివిధ గ్రామాల నుంచి టీడీపీ, జనసేన శ్రేణులు బైక్ ర్యాలీలతో వెళ్ళి పితానికి అభినందనలు తెలుపుతున్నారు. దీంతో పితాని నివాసం రెండు రోజులుగా జనంతో కిక్కిరిసి ఉంటుంది. గురువారం వల్లూరు, పెదమల్లం, అయోధ్యలంక, వేమవరం, కూటమి శ్రేణులు పితాని నివాసానికి వెళ్ళి అభినందనలు తెలిపారు.

సమాజ సేవకుడు విక్టర్ బాబు మృతి

పెనుమంట్ర, జూన్ 6 : దళిత ఉద్యోగుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు, జూనియర్ ఇంజనీర్, సమాజ సేవకుడు బొడ్డు విక్టర్ బాబు అనారోగ్యంతో ఆయన స్వగృహంలో మృతి చెందారు సమాజ సేవకులు మురళి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విక్టర్ బాబు ఈ సమాజానికి ఎనలేని సేవలు చేశారని ప్రజల చేత ఎన్నో మన్నలను పొందారని అన్నారు. సేవల్లో విక్టర్ బాబుని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. మదర్ థెరిస్సా హెల్పింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నక్కా నరేష్ కుమార్, బండి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

ఉండి, జూన్ 6: సెల్‌ఫోన్‌లు వద్దని గ్రంథాలయాలే ముద్దు అని నల్లా ఫౌండేషన్ అధినేత సత్యకిరణ్ ప్రసాద్ విద్యార్థులకు సూచించారు. గురువారం ఉండి గ్రంథాలయంలో విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. నల్లా ఫౌండేషన్ అధినేత ప్రసాద్ మాట్లాడుతూ సమాజానికి అవసరమైన ఏ కార్యక్రమానికైనా తమ సంస్థ సహకారం అందిస్తుందన్నారు. గ్రంథాలయ పాలకుడు కృష్ణమూర్తి మాట్లాడుతూ వేసవిలో మే నెల 15 నుంచి జూన్ 6వ తేదీ వరకు వేసవి విజ్ఞాన తరగతులను నిర్వహించి కార్యక్రమాలను విజయవంతం చేశామన్నారు.

పేద కుటుంబానికి వ్యాపార షెల్టర్ ఏర్పాటు



భీమవరం టౌన్, జూన్ 6: పేద ప్రజలకు చేయూత అందించడంలో 32 డెంటల్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ గౌతమ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి చనమల్ల చంద్రశేఖర్ అన్నారు. భీమవరం పట్టణం రాయలం రోడ్‌లో ఫుట్‌పాత్‌పై బిర్యానీ అమ్ముకుని జీవించే ఒక పేద కుటుంబానికి 50 వేల రూపాయలతో షెల్టర్ తయారు చేయించి అందజేశారు.

డీఎన్ఆర్ డిగ్రీ పరీక్ష ఫలితాలు విడుదల

భీమవరం టౌన్, జూన్ 6 : డీఎన్ఆర్ కళాశాలలో గురువారం 6 వ సెమిస్టర్ డిగ్రీ కోర్సుల పరీక్ష ఫలితాలను కళాశాల పాలకవర్గ సెక్రటరీ, కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు) విడుదల చేశారు. కళాశాల పాలకవర్గ ఉపాధ్యక్షుడు గోకరాజు పాండు రంగరాజు మాట్లా డుతూ ప్రస్తుత విద్య సంవత్సరంలో ఇంత వరకూ 309 మంది విద్యార్థులకు మంచి పేరొందిన సంస్థలలో ఉద్యోగ అవకాశాలు కల్పించామని అన్నారు.